
7

సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



న్యూస్‌రీల్

వచ్చే నెల 13న జాతీయ లోక్ అదాలత్

విశాఖ లీగల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనలతో మే 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.గోపి తెలిపారు. జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకింగ్, మోటారు ప్రమాదాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ చట్టం, రికవరీ, ల్యాండ్ ఎక్విజిషన్, రెవెన్యూ, కార్మిక, కుటుంబ తగాదాలు(విడాకుల కేసులు మినహా) పారిశ్రామిక వివాదాలతో పాటు రాజీపడే క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీ చేసుకోదలచినవారు తమ న్యాయవాది ద్వారా సంసిద్ధతను సంబంధిత న్యాయస్థానం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు ముందుగా తెలియజేయాలని సూచించారు.

త్వరలోనే కాశీకి రైలు

తాటిచెట్లపాలెం: రెండు మూడు రోజుల్లో వారణాసికి రైలు గురించి ప్రకటన రానుందని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన్ని కాశీ రైలు గురించి అడగ్గా.. పై విధంగా స్పందించారు. ఈ రైలు విషయమై రైల్వే బోర్డు నుంచి ఆమోదం వచ్చినప్పటికీ.. మిగిలిన జోన్ల నుంచి కూడా అనుమతులు రావాల్సి ఉందన్నారు. అన్ని పూర్తయిన వెంటనే గంగా పుష్కరాల యాత్రికులకు అనువుగా ఈ రైలు పట్టాలెక్కనుందని వెల్లడించారు.

17 నుంచి దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ పరీక్షలు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో ఎంబీఏ, ఎంబీఏ(హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్), ఎంసీఏ, పీజీ డిప్లమో ఇన్ కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అండ్ అప్లికేషన్(పీజీడీసీపీఏ) కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయని కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 20 కేంద్రాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. పీజీడీసీపీఏ-1లో బ్యాక్‌లాగ్ ఉన్న విద్యార్థులు ఏయూ దూరవిద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మాత్రమే పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను వెబ్‌సైట్ www.andhrauniversity.sde.com నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 0891 2844164, 2754966 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి(క్లరికల్) సిహెచ్. సుబ్బిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ముత్తూట్ ఫిన్ కార్పొ లిమిటెడ్, స్మార్ట్ సర్వీసెస్, కెలిబర్ సపోర్ట్ సర్వీసెస్, మహవీర్ గ్రూప్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 258 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. బ్రాంచ్ మేనేజర్, సేల్స్ మేనేజర్, యూస్ ఐటీ, డైఈటీ, డేటా ఎంట్రీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ టీమ్ లీడర్లు, టెక్నీషియన్లు, సర్వీసు అడ్వైజర్లు, సేల్స్ కన్సల్టెంట్స్ అండ్ టీం లీడర్స్ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీకాం(టాలీ)లో ఉత్తీర్ణత గల వారు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి జీతం నెలకు రూ.18,000 నుంచి రూ.25,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఓపెన్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డిబార్

విశాఖ విద్య: సార్వత్రిక పీఠం(ఓపెన్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. గురువారం పదో తరగతి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పరీక్ష జరిగింది. జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 854 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో 763 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇంటర్ భౌతిక శాస్త్రం, రాజనీతిశాస్త్రం పరీక్షకు 797 మందికి గాను, 720 మంది పరీక్షకు హాజరయ్యారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారుల బృందం చేపట్టిన తనిఖీల్లో పదో తరగతిలో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ నలుగురు విద్యార్థులు పట్టుబడ్డారు. వీరిని డిబార్ చేస్తున్నట్లు విద్యాశాఖాధికారులు ప్రకటించారు.

కొత్త డిష్.. దిల్‌ఖుష్

- కొత్త రుచులకు ఓటేస్తున్న విశాఖ వాసులు
- ఫుడ్ అండ్ బేవరేజెస్ వ్యాపారం పైపైకి..
- కోవిడ్ తర్వాత కోలుకుంటున్న హోటళ్ల రంగం



నగరంలో ఫుడ్ అండ్ బెవరేజెస్, రెస్టారెంట్లు		
సంవత్సరం	యూనిట్లు	వ్యాపారం (రూ.కోట్లలో)
2019-20	4,529	5,661
2020-21	4,750	3,150
2021-22	3,987	3,588
2022-23	4,250	5,104

సాక్షి, విశాఖపట్నం: ఆహా ఏమి రుచి అంటూ విశాఖ వాసులు క్రేజీ టేస్ట్‌ల వైపు అడుగులు వేస్తున్నారు. సంప్రదాయ వంటకాల నుంచి ఇటాలియన్ వరకు, సౌతిండియన్ నుంచి చైనీస్ వరకు.. డిష్ ఏదైనా దిల్‌ఖుష్‌గా రుచి చూస్తున్నారు. అందుకే విశాఖలో ఫుడ్ అండ్ బెవరేజెస్ వ్యాపారం మూడు బిర్యానీలు, ఆరు స్టార్టర్లుగా వెలిగిపోతోంది. కోవిడ్ నుంచి కోలుకుంటూ క్రమంగా దూసుకుపోతోంది. వైజాగ్ ప్రజలకు కొత్త రుచులను అందించేందుకు అనేక రెస్టారెంట్లు కూడా నగరం వైపు క్యూ కడుతున్నాయి.

ఒకప్పుడు ఏదైనా కొత్త డిష్ తయారు చేయాలంటే కాస్తా శ్రమించేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. పర్యాటక స్వర్గధామంగా భాసిల్లుతున్న నగరంలో రోజుకో రెస్టారెంట్ పుట్టుకొస్తోంది. దేశ, విదేశాల ఫుడ్ ఘుమఘుమలు నగరం నలుమూలలకు వ్యాపిస్తున్నాయి. ఫుడ్ లవర్స్‌కు కావల్సిన విధంగా రెస్టారెంట్లలో సౌతిండియన్, నార్త్ ఇండియన్ డిషెస్‌తో పాటు చైనీస్, ఇటాలియన్, మెక్సికో, ఫ్రెంచ్, ఆఫ్గన్.. ఇలా భిన్నమైన టేస్ట్‌లు నగర ప్రజల నోరూరిస్తున్నాయి. ఒకప్పుడు రెస్టారెంట్లకు ఫ్యామిలీతో వీకెండ్స్‌లో వెళ్లేవారు. కానీ ఇప్పుడు వారంలో నాలుగైదు రోజులు హోటల్ రుచులను ఎంజాయ్ చేస్తున్నారు.

పెరుగుతున్న రెస్టారెంట్లు

నగరంలో ఫుడ్ అండ్ బెవరేజెస్ రెస్టారెంట్లు, హోటళ్లు క్రమంగా పెరుగుతున్నాయి. కోవిడ్ సమయంలో చిన్న చిన్న రెస్టారెంట్లు మూతపడ్డాయి. వినియోగదారులు లేక.. వెలవెలబోయిన హోటల్ రంగం కష్టాల్లో కూరుకుపోయాయి. కోవిడ్ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత క్రమంగా ఒక్కో రెస్టారెంట్ తెరుచుకుంది. వినియోగదారులను ఆకట్టుకునేందుకు విభిన్న ప్రయత్నాలు చేస్తూ ఇప్పుడు నిలదొక్కుకున్నాయి. ఫుడ్ అండ్ బెవరేజెస్(ఎఫ్అండ్‌బీ) వ్యాపారం పెరిగినా.. రెస్టారెంట్ల సంఖ్య మాత్రం ఇంకా ఆ స్థాయికి చేరుకోలేదు. కోవిడ్ సమయంతో పోలిస్తే ఇంకా 500 వరకు ఎఫ్ అండ్ బీ యూనిట్లు, రెస్టారెంట్లు తక్కువగానే ఉన్నాయని ది ఇండియన్ వాచ్ సంస్థ నివేదికలో వెల్లడించింది. అయితే సేల్స్ మాత్రం గణనీయంగా పెరిగాయి.

కొత్త రుచులను ట్రై చేద్దాం : నగరంలో ఎక్కడైనా కొత్త రెస్టారెంట్, హోటల్ ప్రారంభమైతే చాలు.. అక్కడ ఫుడ్ ఎలా ఉంది? టేస్ట్‌లో బెస్ట్‌గా ఉంటుందా.. ఏఏ వెరైటీస్ ఆఫర్ చేస్తున్నారు.. ఇలాంటి వాటిపై వైజాగ్ ఫుడీస్‌లో ఎక్కువ క్యూరియాసిటీ కనిపిస్తోంది. కొత్త రుచులను ఆస్వాదించేందుకు సిటిజనులు ఆసక్తి చూపిస్తున్నారు. చవులూరించే ఇటాలియన్ వంటకాలు, నోరూరించే మెక్సికన్ రుచులు, హాయ్‌గా టేస్ట్‌ని అందించే థాయ్ స్పెషల్స్.. అదిరిపోయే అరేబియన్, హాట్ హాట్ ఆఫ్గన్ టేస్ట్‌లు ఎక్కడ దొరుకుతాయోనని సెర్చ్ చేస్తున్నారు. నోరూరించే ఏ టేస్టీ ఫుడ్ అయినా.. ఫుడీస్ ట్రై చేసేస్తున్నారు. నగర ప్రజల అభిరుచుల మేరకు కొత్త వెరైటీలను దించడమే తమ మొదటి విజయమంటూ పలు రెస్టారెంట్‌లు ఆకట్టుకుంటున్నాయి. ఏ దేశంలో.. ఏ కొత్త డిష్ వచ్చినా.. వైజాగ్ ఫుడ్ ప్రియులకు పరిచయం చేసేందుకు పోటీ పడుతున్నాయి. త్వరలోనే ఈ వ్యాపారం మరింత వృద్ధి చెందుతుందని భావిస్తున్నారు.

భానుడు భగభగ



సాక్షి, విశాఖపట్నం : రోహిణి కార్తె ఇంకా రాలేదు.. అయినా రోళ్లు పగిలేలా ఎండలు మండుతున్నాయి. విశాఖపై భానుడు నిప్పులు కక్కాడు. సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవ్వడంతో ప్రజలు విలవిల్లాడారు. సూర్యుడు నడి నెత్తిన చుర్రుమంటూ... అంతకంతకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజలను అల్లాడేలా చేస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. వేడిగాలుల సెగలతో మధ్యాహ్నం పూట బయటకు రావాలంటే భయపడుతున్నారు. రానున్న రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందనీ, ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. విశాఖ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలివీ...

ప్రాంతం	ఉష్ణోగ్రత (సెంటీగ్రేడ్‌లో)
అక్కిరెడ్డిపాలెం (పెందుర్తి)	40.6
ఆనందపురం	40.4
సింహాచలం	40.4
ములగాడ	40.1
మహారాణిపేట	39.7
పద్మనాభం	39.6
గంభీరం	39.3
గాజువాక	39.0
ఆరిలోవ	38.2
పెదగంట్యాడ	38.0



యూపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి, పాల్గొన్న అధికారులు

విశాఖ విద్య: జిల్లాలో యూపీఎస్సీ ద్వారా ఈ నెల 16న నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. శ్రీనివాసమూర్తి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం యూపీఎస్సీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈ నెల 16న యూపీఎస్సీకి సంబంధించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్(1), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్(1)-2023 పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఈ పరీక్షకు 6,442 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని.. అభ్యర్థులు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు యూపీఎస్సీ నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రాల్లోని అనుమతించాలన్నారు. పరీక్ష సమయం కంటే అరగంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు. పరీక్ష రోజు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇన్విజిలేటర్లకు కూడా కేంద్రాల్లో సెల్‌ఫోన్ అనుమతి ఉండదన్నారు. యూపీఎస్సీ అధికారులు, జీవీఎంసీ, పోలీస్, మెడికల్, ఈపీడీసీఎల్ వివిధ కాలేజీల లైజనింగ్ ఆఫీసర్లు, రెవెన్యూ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశాఖ పోలీసులకు సేవా పతకాలు

దొండపర్తి(విశాఖ దక్షిణ): విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన పోలీసు అధికారులకు ప్రభుత్వం ప్రత్యేక సేవా పతకాలను ప్రకటించింది. ఈ అవార్డుల్లో ఒకరికి ముఖ్యమంత్రి శౌర్య పతకం, ఇద్దరికి ఉత్తమ సేవా పతకం, 11 మందికి సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ముఖ్యమంత్రి శౌర్య పతకానికి గ్రేహౌండ్స్ ఎస్ టి.రవికుమార్, ఉత్తమ సేవా పతకానికి ఏఆర్ పీసీ కె.చిన్నయ్య, ఏపీఎస్పీ 16వ బెటాలియన్ ఆర్ ఎస్ఐ ఎ.చిన్నయ్యలు ఎంపికయ్యారు. అలాగే సేవా పతకానికి పూర్వ ఏసీపీ జి.ప్రేమ్ కాజల్, ఇన్‌స్పెక్టర్ ఎ.వి.లీలారావు, ఏపీఎస్పీ 16వ బెటాలియన్ ఆర్ఎస్ఐ యు.రామకృష్ణ, కోస్టల్ సెక్యూరిటీ ఎస్ఐ ఎస్.బాలకృష్ణారావు, ఏఆర్‌హెచ్‌సీలు కె.వైకుంఠరావు, ఆర్.మాధవరావు, ఏఆర్ఎస్ఐ పి.కనకరాజు, దిశ పోలీస్‌స్టేషన్ డబ్ల్యూహెచ్‌సీ పి.గంగమ్మ, పీసీ కె.వి.నరసింహమూర్తి, 16వ బెటాలియన్ ఏఆర్ఎస్ఐ డి.శ్రీనివాసరెడ్డి, హెచ్‌సీ జి.బి.సాంబమూర్తి ఎంపికయ్యారు.

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. 2024-సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం విజయవాడ నుంచి కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు ఇంకో ఏడాది సమయం మాత్రమే ఉందని.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరగనున్న తరుణంలో పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. కొత్త ఓటర్లు నమోదుకు సంబంధించి దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, ఎన్నికల జాబితా, ఎపిక్ కార్డుల ప్రింటింగ్, పంపిణీ, ఎన్నికల నిర్వహణ వ్యవస్థ మొదలైన అంశాలపై కలెక్టర్ డా.మల్లికార్జున మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎస్‌డీసీలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సాయంత్రానికే మాట మార్చారు

- స్టీల్‌ప్లాంట్ అంశంపై కేంద్ర సహాయ మంత్రి విరుద్ధ ప్రకటనలు
- మండిపడుతున్న ఉక్కు కార్మిక సంఘాల నేతలు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై కేంద్ర ఉక్కు సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ మాట మార్చారని కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు. గురువారం ఉదయం పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో కేంద్ర మంత్రి ప్రైవేటీకరణ కంటే ముందు స్టీల్‌ప్లాంట్ బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం నోవాటెల్‌లో ప్రైవేటీకరణ అంశం తన చేతుల్లో లేదని, కేంద్ర పెద్దలతో మాట్లాడి తీసుకోవాల్సిన నిర్ణయమని స్పష్టం చేశారు. మంత్రి చేసిన రెండు విభిన్న ప్రకటనలపై కార్మిక సంఘాలు నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసమే స్టీల్‌ప్లాంట్ అంశంపై స్వరం మార్చారని ఆరోపించారు.

పోరాటాలను చల్లార్చే ఎత్తుగడ



తెలుగు ప్రజలు ఆందోళనకు వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం చేసిన ఎత్తుగడ ఇది. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపం) ఆధీనంలోకి వెళ్లింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ప్రతీ విధాన నిర్ణయం దీపం నుంచి వస్తోంది. మొదట దీపం నుంచి బయటకు తీసుకు వస్తేనే స్టీల్‌ప్లాంట్‌కు స్వయంప్రతిపత్తి లభిస్తుంది. కేబినెట్ నుంచి ఆమోదముద్ర వచ్చే వరకు ఈ నిర్ణయాన్ని నమ్మడానికి లేదు.

– **డి.ఆదినారాయణ**, ప్రధాన కార్యదర్శి, గుర్తింపు సంఘం

నిర్దిష్టమైన హామీ ఇవ్వలేదు



ప్రైవేటీకరణ రద్దు అంశంపై కేంద్ర మంత్రి ఎటువంటి నిర్దిష్టమైన హామీ ఇవ్వలేదు. ప్లాంట్‌కు కావాల్సిన రా మెటీరియల్ ఇవ్వాల్సిన మంత్రి ఆ బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారు. ప్లాంట్‌కు కావాల్సిన రా మెటీరియల్ ఇస్తే కచ్చితంగా లాభాలు సాధించి చూపిస్తాం. ప్రైవేటీకరణ రద్దుపై వెంటనే నిర్ణయం తీసుకోకపోతే మరింత రెట్టించిన ఉత్సాహంతో పోరాడుతాం.

– **జె.అయోధ్యరామ్**, స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు

కేంద్ర ప్రభుత్వ వ్యూహాత్మక ప్రకటన



మంత్రి ఫగ్గన్ చేసిన ప్రకటన కేంద్ర ప్రభుత్వానికి చెందిన వ్యూహాత్మక నిర్ణయం. తన పర్యటనలో ఆందోళనలు జరగకుండా చూసేందుకు ఆ విధంగా మాట్లాడి ఉండొచ్చు. కార్మిక సంఘాలతో జరిగిన సమావేశంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం తన పరిధిలో లేదని, కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పడం బట్టి ఆయన ప్రకటన అర్థమవుతోంది.

– **మంత్రి రాజశేఖర్**, ప్రధాన కార్యదర్శి, స్టీల్ ఐఎన్‌టీయూసీ

మంత్రి ప్రకటన నమ్మేలా లేదు



రెండేళ్లుగా ఇదే మంత్రి పార్లమెంట్ వేదికగా అనేక సార్లు అబద్ధాలు చెప్పారు. కార్మిక సంఘాలతో ఉక్కు యాజమాన్యం, మంత్రిత్వశాఖ చర్చలు జరుపుతుందని అబద్ధాలు చెప్పడం తప్ప ఏనాడు చర్చించలేదు. ప్లాంట్‌కు సంబంధించి వర్కింగ్ క్యాపిటల్, ఐరన్ ఓర్, కోల్, కోక్ ఇవ్వకుండా ఉత్పత్తికి ఆటంకాలు మంత్రిత్వశాఖ కల్పించింది. బలోపేతం చేస్తామంటే ఆహ్వానిస్తాం.

– **వై.మస్తానప్ప**, ప్రధాన కార్యదర్శి, స్టీల్ వైఎస్సార్‌టీయూసీ

స్టీల్‌ప్లాంట్‌లో సైంధవ్


సినిమా షూటింగ్ లొకేషన్‌లో విక్టరీ వెంకటేష్

కొమ్మాది: నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా సినిమా సైంధవ్ షూటింగ్ గురువారం స్టీల్‌ప్లాంట్‌లో మొదలైంది. విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను మరో 5 రోజుల పాటు అక్కడ చిత్రీకరించనున్నారు. వెంకట్ బోయినపల్లి నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు సంతోష్ నారాయణ్ సంగీతం అందిస్తున్నారు.

జీవీఎంసీ మెకానికల్ సెక్షన్‌లో బదిలీలు

అల్లిపురం: జీవీఎంసీ మెకానికల్ సెక్షన్‌లో సిబ్బందిని బదిలీ చేస్తూ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలు అవుతాయని పేర్కొన్నారు. జరజాపు వినోద్‌కుమార్‌ను కాపులుప్పాడ యార్డ్ నుంచి జోన్–1కు, బందు వివేక్‌ను ప్రధాన కార్యాలయం నుంచి కాపులుప్పాడ యార్డ్‌కు, పాసాల నందకిశోర్‌ను జోన్–2 నుంచి జోన్–3 ఎంఎస్‌ఎఫ్‌కు, పెంటా శివకుమార్‌ను జోన్–3 నుంచి జోన్–2కు, ద్వారపూడి శ్రీనివాస్‌ను కాపులుప్పాడ యార్డ్ నుంచి చీమలాపల్లికి, దుక్కా ఆనంద్‌ను కాపులుప్పాడ యార్డ్ నుంచి ముడసర్లోవకు, సిరపూరి చంద్రశేఖర్‌ను జోన్–4 ఎంఎస్‌ఎఫ్–4 నుంచి కాపులుప్పాడ యార్డ్‌కు బదిలీ చేశారు.

అగ్గితో జాగ్రత్త

- అప్రమత్తతే ఆయుధం
- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

అల్లిపురం: వేసవి కాలంలో అధిక వేడితో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. విద్యుత్ తీగలు వేడెక్కినా.. యంత్రాల రాపిడితో మంటలు రేగినా.. వెలుగుతున్న సిగరెట్, బీడీలు పడేసినా.. మంటలకు కారణమయ్యే వ్యర్థాలు తొలగించకపోయినా.. ఇలాంటి కొన్ని సందర్భాల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. ఆస్తుపాస్తులన్నీ బుగ్గిపాలవుతాయి. ఇళ్ల మధ్య ఉండే తుక్కు దుకాణాల్లో జాగ్రత్తలు పాటించకపోతే భారీ నష్టమే జరుగుతుంది. అగ్గితో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదు. అగ్ని ప్రమాదాలు, ముందుస్తు నివారణ చర్యలపై అవగాహన కల్పించేందుకు ఏటా అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తుంటారు. శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు పలు కార్యక్రమాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది.

1944 ఏప్రిల్ 14న ముంబయి ఓడరేవులో జరిగిన అగ్నిప్రమాదం సంఘటన గుర్తుగా ఏటా జాతీయ అగ్నిమాపక దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సూర్యాబాగ్, మర్రిపాలెం, పెదగంట్యాడ, ఆటోనగర్, చిట్టివలస ప్రాంతాల్లోని అగ్నిమాపక కేంద్రాల్లో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహనరావు తెలిపారు. ఈ నెల 14న అగ్నిమాపక దళ పతాకావిష్కరణ, విధి నిర్వహణలో అశువులు బాసిన సిబ్బందికి నివాళులర్పించడం, కరపత్రాల ఆవిష్కరణ, 15న అగ్నిమాపక పరికరాల ప్రదర్శన, అవగాహన, 16న నివాస ప్రాంతాల్లో అగ్నిమాపక నియంత్రణ పరికరాలు, వినియోగం, అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన, 17న విద్యా సంస్థల్లో మాక్‌డ్రిల్, 18న ఎల్‌పీజీ స్టోరేజీ, పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన, 19న ఆస్పత్రుల్లో వైద్యులు, స్టాఫ్ నర్సులు, రోగులకు అగ్నిమాపక నియంత్రణ అనే అంశంపై అవగాహన, 20న అంగన్‌వాడీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన, అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.


సూర్యాబాగ్ అగ్నిమాపక కేంద్రం

అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు	
డయల్	101, 112
విశాఖపట్నం	0891-2563582 2787818, 99637 28301
పెదగంట్యాడ	0891-2517780 2515233, 99637 28664
మర్రిపాలెం	0891-2558470 99637 29367
చిట్టివలస	08933-295101 99637 28726
ఆటోనగర్	0891-2515101 99637 28664

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా విద్యా సంస్థలు, ఎన్‌జీవో హోంలు, పరిశ్రమల్లో భద్రతపై అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేశాం. కరపత్రాల ద్వారా ప్రచారం చేపడతాం. ఈ ఏడాది జాతీయస్థాయిలో ఇద్దరు సిబ్బంది విధి నిర్వహణలో అశువులు బాశారు. వారికి నివాళులు అర్పిస్తాం.

– జె.మోహన్‌రావు, జిల్లా అగ్నిమాపక అధికారి

● అవధుల్లేని అభిమానం




దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాల్లో పలు పథకాల ద్వారా లబ్ధిపొందిన పలువురు అభిమానాన్ని చాటుకుంటున్నారు. అభిమాన నేతల చిత్రపటాలను తమ ఇళ్లల్లో ఏర్పాటుచేసుకొని మురిసిపోతున్నారు. జీవీఎంసీ 32వ వార్డు అల్లిపురం, కర్ణాలవీధిలో ఉంటున్న ఓ మహిళ దేవుడు చిత్రపటం పక్కన జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్ అతికించి సంతోషం వ్యక్తం చేసింది. అదే ప్రాంతానికి చెందిన దేవుడమ్మ గతంలో దివంగత నేత వైఎస్సార్‌తో దిగిన ఫొటో పట్టుకొని జగన్ స్టిక్కర్‌ను చూసి ఉప్పొంగిపోయింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

రూ.65 లక్షలతో ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు


ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: బీచ్‌రోడ్డులోని జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ స్విమ్మింగ్ పూల్‌ను వచ్చే నెల 15 నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. కరోనా కారణంగా కొంతకాలంగా ఈ కాంప్లెక్స్ అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలో గురువారం జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, పలువురు అధికారులతో స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించారు. కాంప్లెక్స్‌లో మరమ్మతులు పూర్తి చేసి పూర్వ వైభవం తీసుకొస్తామని మేయర్ తెలిపారు. రూ.65 లక్షలతో సిరామిక్ టైల్స్, న్యూ ఇన్‌లెట్, ఔట్‌లెట్ పైపుల మరమ్మతులు, పాత పైపులు తీసి కొత్తవి అమర్చడం, పెయింటింగ్‌తో పాటు ఫిల్టర్లు మార్చే పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ నెలాఖరుకు పనులు పూర్తి చేసి వచ్చే 15 నాటికి ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ అందుబాటులోకి తీసుకొస్తామని మేయర్ తెలిపారు.

2070 నాటికి సున్నా ఉద్గారాలే ఐషేర్ లక్ష్యం

ఐషేర్ సర్టిఫైడ్ ఎనర్జీ ఆడిటర్ చంద్రశేఖర్


ఐషేర్ విశాఖపట్నం చాప్టర్ నూతన బృందంతో ఎస్ఎస్ చంద్రశేఖర్

సాక్షి, విశాఖపట్నం : భారత్‌లో 2070 నాటికి ఉద్గారాల నియంత్రణను సున్నాకు చేర్చడమే లక్ష్యంగా ఇండియన్ సొసైటీ ఆఫ్ హీటింగ్, రిఫ్రిజిరేటింగ్ అండ్ ఎయిర్ కండిషనింగ్ ఇంజినీర్స్(ఐషేర్) పని చేస్తోందని మాజీ అధ్యక్షుడు, సర్టిఫైడ్ ఎనర్జీ ఆడిటర్ ఎస్ఎస్‌చంద్రశేఖర్ తెలిపారు. ఐషేర్ విశాఖపట్నం చాప్టర్ 16వ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్థానిక హోటల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఐషేర్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, అందుబాటులోకి తీసుకొస్తున్న సాంకేతిక దేశంలో ఉద్గారాల నియంత్రణకు కీలకంగా ఉపయోగపడుతున్నాయన్నారు. ఎనర్జీ సిస్టమ్స్ డిజిటల్‌గా మారుతున్న నేపథ్యంలో పారిశ్రామిక రంగంలో డీకార్బనైజేషన్‌ను వేగవంతం చేయడంతో పాటు ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా ఐషేర్ అడుగులు వేస్తోందని తెలిపారు. సంస్థ జాతీయ కార్యదర్శి శరవణన్ మాట్లాడుతూ పర్యావరణ వ్యవస్థకు ఐషేర్ దోహదపడుతోందని వివరించారు. ఈ సందర్భంగా 2023–24 విశాఖపట్నం చాప్టర్ ప్రెసిడెంట్‌గా యూసీఎం పట్నాయక్ నియమితులైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐషేర్‌మాజీ అధ్యక్షుడు మధు బుర్రా, ఎస్ఈ–2బీ ప్రాంతీయ డైరెక్టర్ సతీష్‌కుమార్‌రెడ్డి, విశాఖపట్నం చాప్టర్ మాజీ కార్యదర్శి రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డీఎస్సీ-98 కౌన్సెలింగ్

- 324 మందికి నియామక పత్రాలు
- ఏజెన్సీలో తీరిన ఉపాధ్యాయుల కొరత


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: డీఎస్సీ–98 అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు విశాఖ డీఈవో కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న డీఈవో ఎల్. చంద్రకళ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. జాబితాలో ఉన్న 201 నుంచి 355 సీరియల్ నంబర్ల వరకు గల అభ్యర్థులను మెరిట్ మేరకు ఒక్కొక్కరికీ కౌన్సెలింగ్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఖాళీల జాబితాను కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులందరికీ కనిపించేలా ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. అభ్యర్థులు తమకు నచ్చిన పాఠశాలను ఎంపిక చేసుకునేలా తగిన సమయం కేటాయించారు. రెండో రోజు పూర్తిగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే ఖాళీలను చూపించారు. కౌన్సెలింగ్ అనంతరం డీఈవో ఎల్. చంద్రకళ వారికి నియామక పత్రాలను అందజేశారు. దీంతో ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో గల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరింది.

ప్రతీ పాఠశాలలో ఇద్దరేసి ఉపాధ్యాయులు అందుబాటులోకి వచ్చినట్లయింది. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ జ్యోతి, సూపరింటెండెంట్ కె. జగన్నాథరావు, పీఆర్‌వో వర్మ, అల్లూరి సీతారామరాజు డీఈవో కార్యాలయం నుంచి సూపరింటెండెంట్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు. 25 ఏళ్ల తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువు దక్కడంతో డీఎస్సీ–98 అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎంపికైన వారికి డీఈవో చంద్రకళ అభినందనలు తెలిపారు.

324 మందికి పోస్టింగ్

రెండు రోజులు పాటు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 324 మందికి ఉపాధ్యాయులుగా నియామక పత్రాలను అందజేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిబంధనల మేరకు డీఎస్సీ–98లో 355 మందిని ఎంపికచేసి కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. కౌన్సెలింగ్ నాటికి వీరిలో 60 ఏళ్లు నిండిన వారు ఇద్దరు ఉండటంతో వీరి పేర్లను జాబితా నుంచి తప్పించారు. మరో ఇద్దరు కౌన్సెలింగ్‌కు హాజరైనప్పటికీ, పోస్టింగ్‌లు తీసుకునేందుకు నిరాసక్తత వ్యక్తం చేశారు. 27 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్‌కు గైర్హాజరైనట్లు డీఈవో కార్యాలయ అధికారులు వెల్లడించారు. నియామక పత్రాల్లో అందుకున్న వారిలో 93 మంది మైదాన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు దక్కగా, 231 మందికి ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు.

మెట్రో సీసీ విజయం


మెట్రో సీసీ జట్టు

విశాఖ స్పోర్ట్స్: వీడీఎల్‌ఏ ఒకటో డివిజన్ లీగ్ క్రికెట్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో కావలీర్స్ సీసీపై మెట్రో సీసీ 34 పరుగుల తేడాతో విజయం సాధించింది. జింక్ గ్రౌండ్స్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన మెట్రో జట్టు 241 పరుగులకు ఆలౌటైంది. హ్రితిక్ 48, హేమంత్ 40 పరుగులు చేశారు. మెహబూబ్ ఐదు, పి.రాజు నాలుగు వికెట్లు తీశారు. ప్రతిగా కావలీర్స్‌జట్టు 207 పరుగులే చేసింది. అన్షుల్‌గుప్తా(57) అర్ధసెంచరీ నమోదు చేయగా అభినవ్ 36 పరుగులు చేశాడు. మెట్రో బౌలర్లు జి.మనీష్ నాలుగు, అచ్యుత్‌హేమంత్ మూడు వికెట్లు తీశారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తికి జైలు

విశాఖ లీగల్: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జె.పద్మావతి గురువారం తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ తెలిపిన వివరాలివీ.. నిందితుడు కె.మురళీ నగరంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రంగిరీజు వీధిలో నివసిస్తున్నాడు. 2020 జూన్ 10వ తేదీన పరిసర ప్రాంతాల్లో ప్రజల నుంచి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని అడ్వాన్సుగా రూ.1,50,000 చొప్పున వసూలు చేశాడు. కొంత కాలం తర్వాత నిందితుడు మురళీ తన నివాసాన్ని ఖాళీ చేసి.. వేరే ప్రాంతానికి వెళ్లిపోయాడు. ఎప్పటికీ ఉద్యోగాలు రాకపోవడంతో బాధితురాలు కె.ఈశ్వరమ్మ ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఐపీసీ 420 సెక్షన్ కింద శిక్ష విధించారు.

కమ్మ కార్పొరేషన్ నాన్ అఫీషియల్ డైరెక్టర్‌గా దామా సుమంత్


దామా సుమంత్‌ను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, చిత్రంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఏపీ కమ్మ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నాన్ అఫీషియల్ డైరెక్టర్‌గా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దామా సుబ్బారావు కుమారుడు దామా సుమంత్ చౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సుమంత్ గురువారం టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లను కలిసి తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. నాన్ అఫీషియల్ డైరెక్టర్‌గా నియమితులైన సుశాంత్‌ను పలువురు అభినందించారు.

చందనోత్సవంలో స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో భక్తులకు ఉచితంగా ప్రసాదాలు, పానీయాలు అందించే స్వచ్ఛంద సంస్థల సహకారం చాలా గొప్పదని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అన్నారు. ఈ నెల 23న జరిగే చందనోత్సవంలో భక్తులకు సేవలందించే సంస్థల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎవరెవరు ఏయే ప్రదేశాల్లో భక్తులకు ఉచిత ప్రసాదం, పానీయాలు అందిస్తారో తెలుసుకున్నారు. ఏటా సుమారు 70 సంస్థలు చందనోత్సవంలో భక్తులకు సేవలందిస్తున్నాయన్నారు. చిన్నారులకు పాలు, బిస్కట్లు, భక్తులకు మంచినీరు, మజ్జిగ, ఫలాలు, పులిహోర అందజేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అయితే ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకెళ్లేటప్పుడు పోలీసులు తమ వాహనాలను అడ్డుకుంటున్నారని, వెహికల్‌పాస్ చూపించాలని ఆదేశిస్తున్నారని ఈవో దృష్టికి పలువురు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఈవో స్పందిస్తూ పోలీస్ కమిషనర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవో ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌బీ రేక్‌తో గాంధీధామ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్


గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

తాటిచెట్లపాలెం: ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు వాల్తేర్ డివిజన్ చురుగ్గా పనిచేస్తోంది. అత్యాధునిక జర్మన్ టెక్నాలజీతో తయారు చేసిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను పాత కోచ్‌ల స్థానంలో అంచెలంచెలుగా పలు రైళ్లకు జతచేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతీ గురువారం విశాఖపట్నం నుంచి బయల్దేరే విశాఖపట్నం – గాంధీధామ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేశారు. ఈ కోచ్‌లతో కూడిన రైలును గురువారం సాయంత్రం వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) అనూప్ కుమార్ సత్పతి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అనూప్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో అత్యధిక రైళ్లను ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడుపుతున్న ఘనత వాల్తేర్ డివిజన్‌కే దక్కుతుందన్నారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 21 రేక్‌లను, 31 రైళ్లను పూర్తి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడుపుతున్నట్లు తెలిపారు. మరిన్ని రైళ్లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను త్వరలో జత చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అందిస్తున్న సహాయ సహకారాలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి నాయకత్వంలో డివిజన్ దూసుకుపోతోందని తెలిపారు. ఆయన కృషితో ఇటీవల రూ.450 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న మూడు ప్రధాన ప్రాజెక్టులకు సుమారు రూ.600 కోట్లతో పూర్తి చేసేందుకు బుధవారమే ఆమోదం లభించడం డీఆర్‌ఎం పనితీరుకు నిదర్శనమన్నారు.

విద్యాశాఖలో కరపత్రాల కలకలం

అధికారులు, సిబ్బందిపై లేఖాస్త్రం

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని కొంత మంది అధికారులు, ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారని ఎం.ఎస్.రావు అనే ఉపాధ్యాయుడి పేరుతో ప్రచురించిన కరపత్రం గురువారం ఆ శాఖలో సర్వత్రా చర్చనీయాంశమైంది. కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై ఓ సూపరింటెండెంట్‌ను టార్గెట్‌గా చేసి ఆ కరపత్రంలో ప్రస్తావించారు. ఏళ్ల తరబడి డీఈవో కార్యాలయంలోనే తిష్ట వేసి కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టారని పేర్కొంటూ.. ఎంతెంత ఆస్తిపాస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయనే వివరాలను అందులో ప్రచురించారు. రెండు పేజీలతో కూడిన కరపత్రాన్ని ముద్రించి, వాటిని డీఈవో కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగులందరికీ పోస్ట్ ద్వారా పంపించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులకు కూడా వీటిని పంపించడంతో దీనిపై అధికారులు, ఉద్యోగుల్లో తీవ్ర చర్చ జరిగింది. డీఈవో కార్యాలయంలోని ఓ ఉద్యోగి సహకారంతోనే ఇదంతా జరిగిందనే ప్రచారం కూడా ఉంది. టీచర్ పేరుతో బయట వ్యక్తి ఇలా చేశాడని అనుమానిస్తున్నారు. దీనిపై ఎలా ముందుకెళ్లాలని అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఆలోచిస్తున్నారు.

రేపు హనుమాన్ విజయోత్సవ బైక్ ర్యాలీ

సీతమ్మధార: నగరంలో ఈ నెల 15న హనుమాన్ విజయోత్సవ బైక్‌ర్యాలీ, శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ నగర సంఘ చాలక్ పీవీ నారాయణరావు, నగర అధ్యక్షుడు విశ్వనాథ్ తెలిపారు. గురుద్వార్ దరి ఓ హోటల్‌లో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. హనుమాన్ జయంతి పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఎస్ఏడీ నుంచి బీచ్‌రోడ్డు వరకు బైక్ ర్యాలీ, పార్కు హోటల్ నుంచి కాళీమాత ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఎస్ఏడీ సమీపంలోని కరసా పెట్రోల్ బంక్ ఈ యాత్ర ప్రారంభమవుతుందని.. ఊర్వశీ జంక్షన్, నందగిరి నగర్, ద్వారకానగర్, గురుద్వార్, సీతమ్మధార, ఇసుకతోట, ఎంవీపీ డబుల్ రోడ్డు, ఉషోదయ, కామత్ హోటల్ జంక్షన్ మీదుగా పార్కు హోటల్ జంక్షన్‌కు చేరుకుంటుందన్నారు. ఈ ర్యాలీలో నగర ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షుడు అన్నే నారాయణరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యక్షుడు టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాయపూర్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: సంబల్‌పూర్ డివిజన్, టిట్లాఘడ్ – తెరుబలి సెక్షన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- ఏప్రిల్ 17న విశాఖపట్నం – రాయ్‌పూర్ – విశాఖపట్నం (08527/08528) పాసింజర్ స్పెషల్ ఇరువైపులా రద్దు.
- ఏప్రిల్ 16న తిరుపతిలో బయల్దేరాల్సిన తిరుపతి – బిలాస్‌పూర్ (17482) నిర్ణీత సమయం కంటే నాలుగు గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది.

ద్వైపాక్షిక టీ-20 సిరీస్‌కు నేత్ర విద్యాలయ విద్యార్థులు

కొమ్మాది: క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇండియా (సీఏబీఐ) తొలి మహిళా ద్వైపాక్షిక సిరీస్‌కు వారిజా నేత్ర విద్యాలయ విద్యార్థులు ఎంపిక య్యారు. ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు నేపాల్, ఖాట్మండ్‌లో జరిగే ఇండియా వెర్సస్ నేపాల్ టీ–20 మ్యాచ్‌కు ఏపీ తరఫున నేత్ర విద్యాలయానికి చెందిన ముగ్గురు బాలికలు ఎంపికయ్యారు. బీ1 కేటగిరీలో కె.సంధ్య బౌలర్‌గా, వి.రమణి ఆల్ రౌండర్‌గా, బీ3 కేటగిరీలో ఎం.సత్యవతి వికెట్ కీపర్‌గా ఎంపికైనట్టు యాజమాన్యం తెలిపింది. విద్యార్థులు 16న ఢిల్లీకి బయలుదేరనున్నారు.